క్లుప్తంగా

చేతన్ సేవలు ప్రశంసనీయం



కుట్టుమిషన్ల పంపిణీలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ: చేతన్ ఫౌండేషన్ సేవలు ప్రసంశనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖామంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు పేదలకు కుట్టు మిషన్లు, ట్రై సైకిళ్లు, తోపుడు బండ్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ తనకు మంత్రి పదవి వచ్చి రెండు నెలలు అయిందని, అయితే ఈ రెండు నెలల కాలంలో కలగని ఆనందం నేడు కలిగిందన్నారు. సామాజిక సేవలో ఉన్న సంతృప్తి ఎన్ని పదవులు వచ్చినా కలగదన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో చేతన్ ఫౌండేషన్ ద్వారా సామాజజిక సేవా కార్యక్రమం చేపట్టాలని కోరగానే ఆ సంస్థ చైర్మన్ అంగీకరించడం సంతోషించదగిన విషయమన్నారు.

కల్లుకుంటలో పశుగ్రాసం దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రొద్దం: మండల పరిధిలోని కల్లుకుంటలో రైతు నారాయణకు సంబంధించిన గడ్డి వాము దగ్ధమైంది. ఆదివారం గడ్డి వాము పక్కన ముళ్ల కంపలు కాలుస్తుండగా ప్రమాదవశాత్తూ నిప్పులు పశుగ్రాసంపై పడ్డాయి. దీంతో ఆరు బండ్ల గడ్డి దగ్ధమైనట్లు రైతు నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పెనుకొండ అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలార్పినట్లు వివరించారు. రూ.40 వేలు నష్టం జరిగిందని వాపోయారు.

బాధితుడికి పరామర్శ

హిందూపురం టౌన్: ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కామ్రేడ్ బాలస్వామిని సీపీఐ నాయకులు ఆదివారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన శస్త్ర చికిత్స అందించాలని కోరారు. సీపీఐ నాయకులు వినోద్ కుమార్, చలపతి, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షుడు సురేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వీరభద్రుని సేవలో ఐఓబీ ఎండీ



ఐఓబీ ఎండీ దంపతులను సత్కరిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ కే.అజయ్‌కుమార్ శ్రీవత్సవ ఆదివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ విశిష్టతను అర్చకులను అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఎండీ దంపతులను సత్కరించి మెమొంటోను అందజేశారు.

విద్యుత్ వైర్లను తొలగించండి

మడకశిర: మండలంలోని టీడీపల్లి తండా వాసులు ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగించి తమ ప్రాణాలను కాపాడాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వినతి పత్రం అందించారు. టీడీపల్లి తండాలో 11 కేవీ విద్యుత్ వైర్లు 8 ఇళ్లపై వేలాడుతున్నాయన్నారు. విద్యుత్‌శాఖ అధికారులతో మట్లాడి విద్యుత్ వైర్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

శనీశ్వరుని సేవలో ఉద్యానశాఖ మంత్రి



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లికార్జున్

పావగడ: కర్ణాటక రాష్ట్ర ఉద్యానశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ శనీశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శనీశ్వరాలయంలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ సమితి అధ్యక్షుడు ఆనంద రావు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు మంత్రికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శనీశ్వరస్వామికి సర్వ సేవా పూజలు చేశారు. అలాగే శీతలాంబ దేవికి సహస్త్ర కుంకుమార్చన చేశారు.



భద్రతా సిబ్బందిని నియమించాలి

కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం అత్యంత బాధాకరం. ప్రభుత్వాస్పత్రుల్లో రాత్రిపూట విధుల్లో ఉన్న మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వం పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. కోల్‌కత్తా లాంటి ఘటనలతో రోజురోజుకు మహిళా వైద్యులు, మహిళా వైద్య సిబ్బంది ఆత్మ విశ్వాసంతో పని చేయలేని పరిస్థితి నెలకొంటుంది. ఆస్పత్రికి రోగులతో పాటు వచ్చే సహాయకుల సంఖ్యను నియంత్రించాలి. రాత్రి పూట వైద్యులు పని చేసే ప్రాంతంలో మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల పద్ధతిలో నియమించాలి.

– జయవర్ధన్‌రెడ్డి , వైద్యుడు, నీలకంఠాపురం పీహెచ్‌సీ, మడకశిర మండలం



వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా?

ప్రజల ఆరోగ్యాలను బాగుచేస్తూ వారి శ్రేయస్సు కోసం తపించే వైద్యులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరం. కోల్‌కత్తా ఘటన మరోసారి ఎక్కడా జరగకూడదు అంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి. పోలీస్ సిబ్బంది ఆస్పత్రుల వద్ద రాత్రి వేళ గస్తీ నిర్వహించాలి. అప్పుడు కొద్ది వరకూ వైద్య సిబ్బందికి రక్షణ కలుగుతుంది. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– రామకృష్ణ, వైద్యుడు, చిలమత్తూరు పీహెచ్‌సీ



డ్రాగన్‌తో సిరులు

- ప్రత్యామ్నాయ పంటగా సాగు చేస్తున్న రైతులు
- ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువగా ఉండటంతో అన్నదాతల మొగ్గు

అమరాపురం: బోరు బావుల కింద వేరుశనగ పంటను సాగు చేసి నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మడకశిర నియోజకవర్గంలో లేని పంటలను కొందరు రైతులు సాగు చేస్తూ ఇతరులకు ఆ పంటలను పరిచయం చేయడంతో పాటు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే అమరాపురం, రొళ్ల, అగళి మండలాల్లో రైతులు 30 ఎకరాల వరకూ డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్నారు.

పెట్టుబడి తక్కువ..

అమరాపురం మండలంలోని గౌడనకుంట, హలుకూరు గ్రామాల్లో రైతులు మాధవరెడ్డి, రామచంద్రప్ప నూతనంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. పంటకు తక్కువ నీరు అవసరం అవసరం అవుతుండటంతో వారు ఈ పంటను వేశామని చెబుతున్నారు. ఎకరాలో డ్రాగన్ పంట సాగు చేయాలంటే దాదాపుగా రూ.60 వేలు ఖర్చు అవుతుందని అంటున్నారు. ఆ తర్వాత పెద్ద మందులు కూడా అవసరం లేదని చెబుతున్నారు. పెట్టుబడి కూడా తక్కువ అవుతుండటం.. లాభాలు బాగా ఉండటంతో పలువురు రైతులు డ్రాగన్ సాగుకు మొగ్గు చూపుతున్నారు.

రాజమండ్రి నుంచి మొక్కలు

మండలంలోని గౌడనకుంటకు చెందిన రైతు మాధవరెడ్డి తమ గ్రామానికి 750 కిలో మీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రికి వెళ్లి అక్కడ రైతులు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించాడు. అక్కడే మూడు రోజుల పాటు ఉంచి రూ.300 ప్రకారం 250 మొక్కలను కొనుగోలు చేసుకొని వచ్చి గౌడనకుంటకు తీసుకొచ్చాడు. బోరు బావి కింద తనకున్న ఎకరాలో డ్రాగన్ మొక్కలు నాటాడు. ఇందుకు చిన్న స్తంభాలు నాటుకుని బిందు సేద్య పరికరాలతో నీరు కట్టడం ప్రారంభించాడు. దీనికిగాను మొత్తం మొత్తం రూ.90 వేలు ఖర్చు పెట్టాడు. 2018లో పంట సాగు చేశాడు. నర్సరీ బాగా ఎదిగి 2020లో పూత పెట్టి డ్రాగన్ ఫ్రూట్స్ పంట చేతికి రావడం మొదలైంది. దీంతో పంట కోత ప్రారంభించాడు. అప్పట్లో ఈ పంట కొత్త కావడంతో మండలంలో తక్కువ మంది కొనుగోలు చేశారు. ఈ పంటను కర్ణాటకలోని చిత్రదుర్గం, చెలికెర, పావగడ పట్టణాలకు తీసుకెళ్లి హోల్‌సేల్ ధరలకు దుకాణాలకు ఇచ్చి వచ్చేవారు. 2020, 2021 సంవత్సరంలో కేజీ పండ్లకు రూ.250 నుంచి 300 ధరలు మార్కెట్లో పలికాయి. దీంతో రూ.లక్ష వరకూ ఆదాయం వచ్చింది. ఈ ఏడాది తక్కువగా ధరలు ఉండటంతో ఖర్చులు పోను రూ.75 వేలు మిగిలినట్లు రైతు మాధవరెడ్డి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో నాణ్యతను బట్టి కేజీ రూ.100 నుంచి రూ.200 వరకూ ధర పలుకుతోంది.



గౌడనకుంట వద్ద సాగవుతున్న డ్రాగన్ ఫ్రూట్ పంట

హలుకూరులో మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న పండ్లు



చెట్టుకు కాసిన పండ్లు



అమరాపురంలో పండ్లను విక్రయిస్తున్న దృశ్యం

లాభాలు బాగున్నాయి



డ్రాగన్ ఫ్రూట్ సాగుపై నేను సామాజిక మాధ్యమాలతో పాటు పత్రికల్లో చూశాను. నాతో పాటు నా స్నేహితుడితో రాజమండ్రికి వెళ్లా. అక్కడ రైతులు సాగు చేసిన పంటను పరిశీలించి అక్కడి నుంచి మొదటి సారిగా నర్సరీ మొక్కలు తెచ్చి పంట సాగు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. ప్రస్తుతం నేనే డ్రాగన్ మొక్కలు పెంచి విక్రయిస్తున్నాను. మరో ఎకరాలో పంట సాగు చేశా. పంటను చూసిన కొందరు రైతులు సాగు చేయడానికి సిద్ధం అవుతున్నారు. 6 నెలల పాటు పంట చేతకొస్తుంది. వారానికి రెండు సార్లు పంట కోత చేస్తున్నా. ఏడాదికి ఖర్చులు పోనూ రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్ష వరకూ ఆదాయం వస్తోంది.

–మాధవరెడ్డి, రైతు, గౌడనకుంట అమరాపురం మండలం

తెగుళ్ల బెడద లేదు



వ్యవసాయం అంటే నాకు చాలా ఇష్టం. వ్యాపార రీత్యా నేను బెంగళూరులో ఉన్నా. అయితే నాకున్న ఆరు ఎకరాల్లో వ్యవసాయం చేసి నలుగురికి ఉపాధి ఇవ్వాలని అనుకున్నా. అందులో పొలంలో బోరుబావి తవ్వించి గతంలో దానిమ్మ సాగు చేశాను. అయితే దానికి ఎరువులు, మందులు సక్రమంగా పిచికారీ చేయాలి. ఖర్చులతో కూడుకున్న పంట ఇందులో లాభాలు రాలేదు. దీంతో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేయాలని అనుకున్నా. మూడేళ్లుగా పంట సాగు చేస్తున్నాను. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. నీటి ఆదాతో పాటు తెగుళ్ల బెడద లేదు. దీంతో పంట దిగుబడి ఉంది. ఈ ఏడాది పంటను అమ్ముతున్నా. గత ఏడాది రూ.8 లక్షల ఆదాయం వచ్చింది. వారానికి ఒకసారి వచ్చి పంటను పరిశీలిస్తున్నాను.

– రామకృష్ణప్ప, రైతు, హలుకూరు అమరాపురం మండలం

నేడు కృష్ణాష్టమి వేడుకలు

పెనుకొండ: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం వేణుగోపాలస్వామికి అభిషేకాలు, చిన్ని కృష్ణుల ఊరేగింపు, ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హిందూపురంలో..

హిందూపురం అర్బన్: పట్టణంలోని వాసవీ ధర్మశాల పరమేశ్వరీ హాల్‌లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని బెంగళూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. అక్షయ పాత్ర సంస్థ ద్వారా అన్నప్రసాదాలను అందిస్తామన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

సందడిగా కృష్ణాష్టమి



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆశ్రమాధిపతి స్వామి జపానంద ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష కృష్ణ నామ సంకీర్తనలు, భజనలు, ఉపన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా స్వామి జపానంద ఆలపించిన కృష్ణ నామ సంకీర్తనలు శ్రవణానందం కల్గించాయి. అలాగే ఆరేళ్ల వయసులోపు చిన్నారుల రాధాకృష్ణ వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శన అనంతరం చిన్నారులందరికీ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



అలంకరణలో రంగనాథస్వామి

హిందూపురం టౌన్: పట్టణంలో వెలసిన రంగనాథ్ స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువు దీర్చారు. విశేషాలంకరణ అనంతరం స్వామి వారి పల్లకీని ఊరేగిస్తూ డప్పు వాయిద్యాల నడుమ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ అర్చకులు గోవిందశర్మ, , ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరుడు

అమరాపురం: మండలంలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. శ్రావణమాసం కావడంతో నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి సమీపంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. కమిటీ తరుపున భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

విద్యుదాఘాతానికి గురైన మహిళ

- మోటారు ఆన్ చేస్తుండగా ఘటన
- నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నామంటున్న రొళ్ల వాసులు

రొళ్ల: మండల కేంద్రంలోని ఇందిరమ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మీదేవి ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురైంది. వివరాల్లోకి వెళితే ఇందిరమ్మ కాలనీలో సుమారు 90 ఇళ్లు ఉన్నాయి. వాటర్‌స్కీమ్ పథకం బోరుబావిలో కేవలం దిగువ ప్రాంతాలకు మాత్రమే కొళాయిల ద్వారా నీళ్లు సరఫరా అవుతున్నాయి. అయితే పాదాలబండ (కొండ) ప్రాంతం ఆనుకుని ఉన్న ఇళ్లు ఎత్తు ప్రదేశంలో ఉన్నాయి. దీంతో పైప్‌లైన్ సౌకర్యం లేని కారణంగా ఆ ప్రాంతాల్లో నివాసం ఉన్న వారు మంచినీటి కోసం రోజూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో దిగువ ప్రాంతంలో ఉన్న వీధి కొళాయి నుంచి పైప్ సహాయంతో నీళ్లు తెచ్చుకొనే ప్రయత్నంతో లక్ష్మీదేవి సింగిల్ ఫేస్ మోటారు ఆన్ చేస్తుండగా ఆమె విద్యుదాఘాతానికి గురైంది. దీంతో అక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే చుట్టు పక్కల నివాసం ఉన్న వారు మోటారు అమర్చిన వైరును తొలగించి ప్రైవేట్ వాహనంలో ఆమెను రొళ్ల సీహెచ్‌సీకి తరలించారు. ఎడమ చేతికి షాక్ తగలడంతో గాయమైంది. ప్రస్తుతం లక్ష్మీదేవి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతానికి తరలించాలని వైద్యులు తెలిపారు. ఇప్పటికైన సంబంధిశాఖ అధికారులు చర్యలు తీసుకుని ఎగువ ప్రాంతానికి పైపులైన్ సౌకర్యం ఏర్పాటు చేసి నీటి సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



రొళ్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

రొళ్ల: ఆటో, టెంపో ఇతరాత్ర వాహనాల డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని మడకశిర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ బస్టాండ్ ఆవరణలో ఆటో, టెంపో ఇతరాత్ర వాహనాల డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్‌తో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం మత్తులో వాహనం నడిపితే జరిమానతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జమేదార్ ముత్యాలప్ప, కానిస్టేబుళ్లు, ఆటో, టెంపో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



రొళ్ల బస్టాండ్ ఆవరణలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజ్‌కుమార్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

అమరాపురం: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఉదుగూరు, అమరాపురం, కెంకెర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈరన్న, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్, సీనియర్ నాయకుడు ఉదుగూరు నాగరాజు, కార్యకర్తలను కలిశారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనంతో పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. అదేవిధంగా మండలంలో పార్టీ పరిస్థితిపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

ఉమర్ ఫారూఖ్‌ఖాన్‌కు 'వేమన సాహితీ పురస్కారం'

హిందూపురం టౌన్: హిందూపురం సామాజిక సేవకుడు, కవి, రచయిత కల్లూరు మహమ్మద్ ఉమర్ ఫారూఖ్‌ఖాన్ వేమన సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆదివారం గాండ్లపెంట మండలంలోని కటారుపల్లిలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద వేమన సాహితీ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా, రాయసం చిన్నారావు, బాబా ఫక్రుద్దీన్, శంకరనారాయణరాజు సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూక్ మాట్లాడుతూ ప్రజాకవి వేమన తెలుగుభాషకు పట్టుగొమ్మ లాంటివారన్నారు. వేమన పద్యాలు సమసమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయన్నారు. తెలుగు భాష మనుగడ కోసం , తెలుగు పద్యం గొప్పదనాన్ని చాటడం కోసం వేమన సాహితీ యాత్రను చేపడుతున్నామన్నారు. పురస్కారం రావడంపై హర్షం వ్యక్తం చేశారు.



ఉమర్‌ఫారూక్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

గుడిబండ: స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు జీవనోపాధి కల్పనలో భాగంగా ప్రతి గ్రామంలో 70 మంది మహిళలను లక్షాధికారిగా చేయడమే ధ్యేయంగా మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం 'లక్ పత్ దీదీ' యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఏపీఎం రామాంజప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'లక్ పత్ దీదీ' పథకం ద్వారా గ్రామాల్లో ఉన్న ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలకు ఉపాధి కల్పించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో ఉన్న మహిళా సంఘాల్లో ప్రతి మహిళకు రూ 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను బ్యాంకుల ద్వారా అందిస్తామన్నారు. 236 మంది మహిళలకు 'లక్ పత్ దీదీ' పథకం ద్వారా రూ. 2 కోట్లా 15 లక్షలా 50 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు శాంతమ్మ, చౌడమ్మ, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మండల సమైఖ్య అధ్యక్షురాలు తిప్పమ్మ

లేపాక్షి: లేపాక్షిలోని స్థానిక నందీశ్వర మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం ఉదయం 'లక్ పత్ దీదీ'పై కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఆర్‌పీలు, లక్ పతి దీదీలు, మండల సమాఖ్య ప్రతినిధులు , మండల సిబ్బంది హాజరయ్యారు. అనంతరం మండల సమాఖ్య ట్రెజరర్ రాధమ్మ, ఏపీఎం జయచంద్ర, సీసీలు రామాంజినేయులు, రత్నమ్మ, హరికృష్ణారెడ్డి, ఆనంద్, నాగలక్ష్మి, అకౌంటెంట్ సుజాత, యానిమేటర్లకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వినాయకనగర్‌కు చెందిన చేనేత కార్మికురాలు పూజారి లక్ష్మీదేవి (54) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న తొగటవీర, పద్మశాలి, దేవాంగం కుల సంఘం నాయకులు మృతురాలి భర్త శ్రీరాములుకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈరలింగేశ్వరస్వామికి పూజలు

అమరాపురం: మండలంలోని బంగారు పాళ్యం గ్రామానికి వెళ్లే రహదారిలో వెలసిన ఈరలింగేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఉపవాస దీక్షలతో ఆలయం వద్దే వంటా వార్పు చేశారు. అనంతరం స్వామి వారికి నైవేద్యంగా పెట్టారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

సమస్యలు పరిష్కరించండి

మడకశిర: పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పర్యటించారు. చౌటిపల్లి, మారుతీనగర్, చాకలికుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా 17వవార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర తమ వార్డులోని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను ఒక ప్రకటనలో కోరారు.



ఎమ్మెల్యేకు సమస్యలు చెబుతున్న ప్రజలు